ఈ వారం కథ

# ఫ్రీజ్

— జూకంటి జగన్నాథం



"ఏమయింది?"

"ఏమో?"

"ఎట్లా?"

"ఎట్లనో?"

"ఎంత సేపయితదో?"

"తెల్వదు"

"ఆక్సిడెంటా?"

"ఎవరి కెరుక?"

"మరె... బాగాలేని మనిషి కూడా వుందిగదా?"

"బాగున్న మనమేం చేసేదీ లేదు మరి"

"అంతేనా?"

"అంతే"

మాంచి నిద్రలో వున్న నాకు సడన్ బ్రేకుతో మెలుకు వొచ్చింది. బస్సు ఆగింది. చుట్టూ జనం నానా రకాలుగా మాట్లాడుకుంటున్నారు. డోర్ తీసుకొని కండక్టర్ బస్సు దిగాడు. అంతకు ముందే డ్రైవర్ దిగి ముందున్న వాహనాలను దాటి నడుస్తున్నాడు.

ఆవరిస్తున్న నిద్రను అవతలికి నెట్టి ఒక్కసారి చుట్టూ కలియచూశాను. నా ముందు కండక్టరు సీటు పక్కన కూర్చొన్న తెల్లని లాల్చీ- పైజామా అతను సురక్షితంగానే వున్నాడు. కుడి వైపు మధ్యవయస్సు దాటిన దంపతులపక్కన కూర్చున్న రెండు జడల అమ్మాయి అలాగే వుంది. ఓ మోస్తరు తెల్లని శరీర ఛాయ, అందమైన కళ్ళు, వయస్సు పద్దె నిమిది నుండి ఇరవై వరకూ వుండవచ్చు. లంగా, ఓణీ వల్ల ఇంకా పెళ్ళి కాలేదని తెలుస్తోంది. కొంచెం వెనుక వైపు సీట్లో హుజురాబాద్‌లో బస్సు ఎక్కిన గర్భవతి కండక్టరు ససేమిరా వద్దంటే కాళ్ళా వేళ్ళా పడి 'బాంచెన్ బాంచెన్' అని బస్సెక్కారు. రాత్రి నుంచి నొప్పులట, ప్రసవం కాలేదు. కరీంనగర్ తీసుకు పొమ్మని ఉదయం నాలుగు గంటలకు చెప్పాడట డాక్టరు. పాపం మట్టి పనిచేసే వడ్డెర వాళ్ళున్నట్టు వున్నారు. అందుకే బస్సు కోసం చూసి ... చూసి... వచ్చిన బస్సులో బ్రతిమలాడి బ్రతిమలాడి బస్సెక్కారు.

గర్భవతి "అవ్వ ... అ...వ్వా... అయ్యో-" అంటున్న మూలుగులు విని పిస్తున్నాయి.

"మన కర్మేందోగాని ఈ బస్సు సుత గిక్కన్నే ఆగన్నా?" గర్భవతిని పట్టుకున్న ముసలమ్మ ఆందోళనతో అంది.

"అయ్యో!..." కడుపును పట్టుకుని గర్భవతి బాధను అణుచుకోలేక ఈసారి కొంచెం బిగ్గరగానే మూలిగింది.

ఒక్కసారి బస్సులోని ప్రయాణీకు లంతా వెనకవైపు చూశారు.

"రాత్రి నుంచీ గిదే గోస. ఓ అవ్వా ... కొంచెం అనుసుకోవె, బాదుంటది, ఏం సేత్తాం, నారాయణ అనుకో" అని ముసలమ్మ గర్భవతిని ఓదారుస్తోంది. గర్భవతి మెలికలు తిరిగిపోతూనే వుంది.

కిటికీ అవతలవైపు చూశాను. ఇవతలి దిక్కూ చూశాను. దూరంగా ఆనకట్ట కనబడుతూంది. మానేరు నది ప్రవాహం వద్ద సిమెంటుతో కట్టారు. ఇరువైపులా మట్టితో కట్ట పోశారు. మట్టి కట్టకు ఆ చివర ఈ చివర ఇంత లావు సిమెంట్ ఇంగ్లీషు అక్షరాలతో 'లోయర్ మానేర్ డ్యామ్' అని రాసి వుంది.

మానేరు వంతెన పైన బస్సు ఆగిందనుకున్నాను.

అసలు ఏమయిందో ముందు చూద్దాం అని సీటుపైన సంచి పెట్టి కిందికి దిగాను. నా ముందు దాదాపు ఇరవై వాహనాల వరకూ ఆగాయి. చూస్తుండగానే వెనుకవైపు యాభై అరవై వాహనాలు ఆగాయి.

ఏమయిందని, పక్కన నిలుచున్న వ్యక్తులను వాకబు చేస్తే, వంతెన అప్రోచ్ రోడ్డు మీద బస్సుకు ఏమో అయిందని తెలిసింది: సరిగ్గా వంతెన ఎక్క ముందు బస్సు చెడిపోయింది! పక్కన అతి కష్టంగా మరో బస్సు పోయేంత స్థలం వుంది. కానీ వెనుక వచ్చిన మరో బస్సు ఈ చెడిపోయిన బస్సును దాటబోతూ మధ్యలో ఇరుక్కుపోయింది. కొంచెం

---

**మనకు సంబంధంలేని, మనం బాధ్యత వహించని దూరపు అంశాలపై చర్చించి, తీర్పులు ప్రకటిస్తుంటాం. అదే సమయంలో మనం చూస్తున్న మనం బాధ్యత వహించవలసిన పక్క వాళ్ళ సమస్యను పట్టించుకోం. అలాంటి వాటిపై అంత ఆసక్తి చూపే మనం, ఇలాంటి వాటిపై ఇంత అనాసక్తి చూపుతామెందుకు?**

---

పక్కకు వెళితే ప్రమాదం. వెనకకు పోదామంటే లారీలు, వ్యానులు. బస్సు ముందుకు ఇప్పట్లో కదలదని తెలిసేసరికి పక్కనున్నవారితో పక్క సీట్ల వారితో ఎక్కడి వారక్కడ ముచ్చట్లు పెట్టుకున్నారు.

లాల్చీ అతను "ఏమండీ! మీరెక్కడి వరకు?" ప్రశ్నించాడు.

"కామారెడ్డి" ముక్తసరిగా చెప్పాను.

"కామారెడ్డికేనా లేక అక్కడి నుంచి ఇంకా ముందుకా?" ఆ ప్రశ్నకే ఇంకో మెలిక వేసి పొడిగించాడు.

"కామారెడ్డికే" అన్నాను కచ్చితంగా.

ఇక ఈయన ప్రశ్నలన్నిటికీ జవాబిస్తే పుట్టుపూర్వోత్తరాలూ అడిగేలా వున్నాడు!

"ఏమండి, పేపర్ ఈ రోజుదా? ఇటివ్వండి" అని చేయి చాపాను.

"ఆ ఈ రోజుదే. హుజురాబాద్‌లో కొన్నాను" వివరంగా చెప్పి మరీ ఇచ్చాడు.

పతాక శీర్షికలో 'జాఫ్నాలో శాంతి దళానికి, పులులకూ భీకర పోరాటం' అనుంది.

"ఏమండీ, మన రాజీవ్ గాంధి పాలసీ ఏందసలు? జయవర్ధనే చాలా తెలివిగలవాడు! మన వేలితోనే మన కన్ను పొడుస్తున్నాడు" లాల్చీ.

"అలా అంటే ఎలాగండీ, మన సైనికులపైనే టైగర్స్ కాల్పులు జరిపితే మన వాళ్ళు తిరిగి కాలుస్తున్నారట" నా పక్కతని సమాధానం.

లాల్చీ అతనికీ, పక్కతనికీ, ఆ పక్కతనికీ వాగ్వాదం సాగింది.

నేను మధ్యలో కలుగచేసుకోకుంటే బాహాబాహిగానీ, సంకుల సమరంగానీ జరిగే ప్రమాదముందనిపించింది.

"అసలు తమ స్వాతంత్ర్యం కోసం ఆయుధాలు పట్టిన ప్రజలను ఒప్పందానికి పిల్చారంటేనే బాగా ఆలోచించాలి. పోరాటాన్ని నాశనం చేయడానికే ప్రపంచంలో ఒప్పందాలు జరుగుతాయి. న్యాయం జరుగదు. జరిగి



నట్టు అనిపించే హత్యలే జరుగుతాయి. సాంటియాగో ఏమయ్యాడు? ప్యారిస్ కమ్యూన్ ఏమయింది? ఇది కూడా గంతే?" అన్నాను.

నా జవాబు ఇద్దరికీ కొంచెం నచ్చి నట్టుంది. ఆలోచనలో పడ్డారు.

తిరిగి నేను పేపర్లో తల దూర్చాను. వెనకవైపు ఆగిన వాహనాల హారన్లు విని పిస్తూనే వున్నాయి. ముందున్న వాహనాల డ్రైవర్లు సిగరెట్లు, బీడీలు తాగుతూ మాట్లాడుకుంటూ వున్నారు.

"ఏమండీ, మొన్న మద్రాస్ వన్ డే క్రికెట్‌లో ఆస్ట్రేలియాతో అంత ఘోరంగా ఓడిపోతారా మనవాళ్ళు! మన ఆటగాళ్ళకు బుద్ధి రాదయ్యా. ఈర్ష్య, ద్వేషం తప్ప టీమ్ స్పిరిట్ లేనే లేదు" నా పక్కనతని 'రిలయన్స్ కప్' రివ్యూ!

గర్భవతి హీన స్వరంతో మూలుగు తూంది. ముసలమ్మ తువ్వాలుతో విసురు తూంది. రెండు జడల అమ్మాయి నా వైపు పదే పదే చూస్తూనే వుంది.

బస్సులు, జీపులు, కార్లు వచ్చి ఓ వంద వరకూ ఆగాయి.

ఇప్పటికి తేలిందేమంటే బస్సు డిపో మెకానిక్ కోసం కబురు చేశారు. వాళ్ళు వచ్చి ఈ బస్సును బాగు చేస్తేనే ముందుకు ప్రయాణం సాగుతుంది. అంటే దాదాపు ఇంకా గంటకు పైగా ఇలాగే వుండాలి. ఆ తర్వాత వాహనాల రద్దీ తొలగేందుకు మరో అరగంట.

లాల్చీ - పైజామా అతనికి ఈ ఎండకే విపరీతంగా చెమట కారుతోంది.

'ఉష్' అంటూ జేబు రుమాలుతో తుడుచుకుంటున్నాడు. ఎండను భరించడం వల్ల కాదని అతనూ, నిలబడే ఓపిక లేక నేనూ బస్సు ఎక్కాను.

కండక్టర్ వంతెన పక్క గోడపైన కూర్చొని ప్రయాణికులతో 'హస్కు' కొడుతున్నాడు.

గర్భవతికి మూలిగే ఓపిక కూడా లేనట్టుంది.

వరంగల్ నుంచి నిజామాబాద్ ఎక్స్ ప్రెస్ ఉదయం నాలుగు గంటలకు బయలుదేరాలి. కానీ అక్కడ్నే అరగంట ఆలస్యమైంది. నేను కామారెడ్డికి బ్యాంకి సమయానికి చేరాలి. ఇలా అయితే చేరేట్లు కనబడడం లేదు.

అంతవరకూ గడ్డకట్టుకుపోయిన వాతావరణం ఉదయపు ఎండకు మెల్ల మెల్లగా కరిగి ప్రవహిస్తున్నట్టుంది.

బయట ప్రయాణికులు ఎవరి బస్సులో వారు ఎక్కుతున్నారు. మా ముందున్న లారీకి 'సెల్ఫ్' లేనట్లుంది. కొందరు ముందుకు నెడుతున్నారు.

పదిహేను నిమిషాలు అయింది. మెల్ల మెల్లగా వాహనాలు ముందుకు కదులు తున్నాయి. మా బస్సు కదిలి వంతెన దిగి రోడ్డుపైకి చేరింది.

గర్భవతి వెంట వచ్చినాయన భర్త కావచ్చు. డ్రైవర్ దగ్గరకుపోయి "అయ్యా! కొంచెం తొందరగ పోనీ బాంచెన్' అని బతిమిలాడుకున్నాడు. డ్రైవర్ బస్సును వేగంగా వాహనాలను తప్పిస్తూ ముందుకు నడిపి, ఆపాడు.

"ఆ... ఆ... కమాన్ వచ్చింది. దిగండి" కండక్టర్.

ఒక్కొక్కరూ దిగుతున్నారు.

"అయ్యో ... బిడ్డా ... అయ్యో నా బిడ్డా..." అంటూ ముసలమ్మ ఒళ్ళో పడుకున్న గర్భవతిని అటూ ఇటూ కది లిస్తూ బిగ్గరగా ఏడుస్తోంది.

వెంబడి వచ్చినతను "అమ్మీ" అని కదుపుతూ గుండె పగిలేట్టు ఏడుస్తు న్నాడు.

"ఏమయ్యా కిందికి దించండి, ఇప్పటికే బస్సు ఆలస్యమయింది. పోయింది నత్తదా, దిగుండ్రి" లాల్చీ అతను అంటున్నాడు.

అతను శవాన్ని అమాంతం భుజం పైన ఎత్తుకొని ఏడుస్తూ దిగాడు.

నేను నా బ్యాంక్ టైమ్‌లో చేరు తానో లేదో అనే మీమాంసలో పడి పోయాను.

బస్సు దిగుతున్న ప్రయాణికుల్లో ఏదో గడ్డకట్టినట్టు నిశ్శబ్దం!

# మనమూ వున్నాం




## మంచి నడవడి

మంచి క్రమశిక్షణ గల ఇంట్లో పెద్దవాళ్ల మనను ప్రకారం చిన్నవాళ్లు నడుచుకుంటూ వుంటారు. పెద్దవాళ్ల అలవాట్లే ఆ ఇంట్లో వాళ్లకి కూడా అలవడుతాయి. చివరకు ఇంట్లో వుండే కుక్కపిల్లలు, మరి ఏ ఇతర జంతువు లైనా సరే.

జనరల్ కోసియస్కో పోలిష్ దేశ భక్తుడు. ఆయన పేదవాళ్ల మీద ఎంతో దయ చూపిస్తూ వుండేవాడు. ఓసారి అత్యవసరంగా ఓ సందేశాన్ని ఒక చోటికి పంపాల్సి వచ్చింది. ఒక్క గుర్రం కూడా అందుబాటులో లేదు. 'సరే, నా గుర్రాన్ని తీసుకెళ్లు' అన్నాడు జనరల్ సైనికునితో. మొత్తా నికి ఆ సైనికుడు ఆ గుర్రాన్నెక్కి వెళ్లవలసిన చోటికి వెళ్లి మళ్లీ తిరిగి వచ్చాడు. అతను కోసియస్కోని కలసి "అయ్యా! ఈసారి కాస్త ఆలస్యం అయినా వేరే గుర్రం వచ్చే వరకు ఆగి బయలుదేరుతాను" అన్నాడు.

"ఏమయింది? ఈ గుర్రం నిన్ను అవస్థ పెట్టిందా?" అడిగాడు కోసియస్కో.

"అయ్యా! ఏం చెప్పమంటారు? ఆ గుర్రం ఏ బిచ్చగాడు కనిపించినా, ఏ పేదవాని ఇల్లు కనిపించినా ఆగి పోతూ వుండేది" అన్నాడు.

కోసియస్కో ఆ గుర్రం మీద వెళుతూ ప్రతి బిచ్చగాడి దగ్గర, ప్రతి పేదవాడి ఇంటి దగ్గరా ఆగి, వాళ్ల అవసరాలు తెలుసుకుని ధర్మం లేక సహాయం చెయ్యటం ఆయనకి బాగా అలవాటు. అదీ సంగతి.

– యస్


అతిత్వరలో యండమూరి వీరేంద్రనాథ్ తాజా నవల




ముప్పేటగా రానున్న సినిమాకు ఈ నవలే మూలం!

స్టూవర్టుపురం పోలీస్ స్టేషన్